క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ జయంతి


హోమం నిర్వహిస్తున్న వేదపండితుడు

దహెగాం: మండల కేంద్రంతో పాటు, బీబ్రా తదితర గ్రామాల్లో మంగళవారం దత్తాత్రేయ జయంతిని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. బీబ్రా గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర సద్గురు సాయినాథ దేవాలయంలో హోమం నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో నగర సంకీర్తన చేపట్టారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

గొంతెమ్మ ఆలయంలో పూజలు


పూజ చేస్తున్న ఆలయ పూజార్లు

పెంచికల్‌పేట్: మండలంలోని మెరెగూడ గ్రామ సమీపంలో గల గొంతెమ్మ ఆలయంలో నూతన దేవతామూర్తుల ప్రతిమలు కొలువుదీరాయి. ఏటా జనవరిలో ఆలయ ప్రాంగణంలో నిర్వహించే బోనాల పండుగకు ముందు దేవతా మూర్తులకు పవిత్ర గంగాస్నానం చేయించి ఆలయంలో ప్రతిష్ఠించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ప్రధాన పూజారి రాజన్న గిరిజన సంప్రదాయంలో లక్ష్మీ దేవరా, పోతురాజు, భీమన్న, గొరిగొడ్డు, నిషాలకు పూజలు చేసి ప్రాంగణంలో నిలిపారు. వచ్చే నెలలో బోనాల పండుగ నిర్వహిస్తామన్నారు.

బస్సు ట్రిప్పులు పెంచాలి

దహెగాం: మంచిర్యాల డిపో ఆర్టీసీ బస్సులు దహెగాం మండల కేంద్రానికి వస్తున్న నేపథ్యంలో ఉదయం సమయంలో మరో ట్రిప్పు బస్సు సర్వీసు నడిపించాలని మండలవాసులు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నందున ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఉదయం వేళలో ఒక ట్రిప్పు మాత్రమే వస్తున్నందున ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ప్రయాణికులు ఫుట్‌బోర్డుపై నిల్చొని ప్రమాదకరంగా ప్రయాణం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి మరో ట్రిప్పు పెంచాలని మండల ప్రయాణికులు కోరుతున్నారు.

29న సర్వసభ్య సమావేశం

తిర్యాణి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 29న ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండలస్థాయి అధికారులు, మండల పరిషత్ సభ్యులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ఆవు ప్రతిమ బహూకరణ


ఆవు ప్రతిమ బహూకరించిన బాలాజీ

కెరమెరి: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి నిఆమె స్వగృహంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఉత్తమ రైతు కేంద్రె బాలాజీ కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆవు ప్రతిమ బహూకరించారు. అనంతరం మిఠాయిలు తినిపించారు. మండలంలో నెలకొన్న సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. మండల రైతు సంఘం అధ్యక్షుడు రాంచందర్, రైతులు దుందేరావు, జలపతిరావు, దస్తగిరి, నాగ్‌నాథ్, సిరాజ్, భీంరావు, మారుతి తదితరులు ఉన్నారు.

శివాలయంలో ముగిసిన ఉత్సవాలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే 'పాల్వాయి'

కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయ 50వ వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఉదయం ఆలయంలో అగ్నిగుండ ప్రవేశం, రుద్రహోమం, పూర్ణాహుతి, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు అంబేద శంకరయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్గి రాజుకుంటే బుగ్గే..!

- అగ్నిమాపక కేంద్రం లేక తిప్పలు
- కెరమెరిలో ఏర్పాటు చేయాలని వేడుకోలు
- తరుచూ ప్రమాదాలు..
- పట్టించుకోని అధికారులు


ఇటీవల ఖైరీ గ్రామంలో కాలిన పత్తి పంట


అనార్‌పల్లిలో దగ్ధమవుతున్న వాహనం (ఫైల్)

కెరమెరి: అగ్నిమాపక కేంద్రం అందుబాటులో లేకపోవడంతో మండలంలో ప్రమాదాలు జరిగినప్పుడు పెద్దఎత్తున ఆస్తినష్టం సంభవిస్తుంది. మండలంలోని అనేక గ్రామాల్లో పెంకుటిళ్లు, పూరి గుడిసెలు ఉన్నాయి. దీంతో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఆసిఫాబాద్‌లో ఉన్న ఫైరింజన్ వచ్చే సరికి చాలా ఆలస్యం అవుతుండడంతో ఎలాంటి ఫలితం లేకుండా పోతోంది. వెంటనే ప్రభుత్వం స్పందించి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండలవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఆలస్యంతో తీవ్ర నష్టం..

మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల్లో ప్రతి వేసవిలో పదుల సంఖ్యలో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉండే ఆసిఫాబాద్ నుంచి అగ్నిమాపక వాహనం వచ్చే సరికి చాలా ఆలస్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఫైరింజ్ వచ్చినా పెద్దగా ప్రయోజనం ఉండడం లేదని అది వచ్చే సరికే పూర్తి నష్టం జరుగుతుందని పేర్కొంటున్నారు. మండలవాసులు గతంలోనే అగ్నిమాపక కేంద్రాన్ని మండలంలో ఏర్పాటు చేయాలని అధికారులకు నివేదించారు. మండంలో ఏర్పాటు చేస్తే సమీప మండలాలు జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, తదితర మండలాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు.

దూరంగా గ్రామాలు..

మండలంలోని పరంధోళి, అంతాపూర్, కోండిబాగూడ, లక్మాపూర్, కోటా, మహరాజ్‌గూడ, పద్మావతి, లేండిగూడ, బోలాపటార్, జోడేఘాట్, టోకేన్‌మోవాడ్ లైన్‌పటార్ తదితర గ్రామాలు అగ్నిమాపక కేంద్రానికి 50 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే ఫైరింజన్ సంఘటన స్థలానికి వచ్చే సరికి గంట నుంచి రెండు గంటల సమయం పడుతుంది. దీంతో ప్రమాదాలను నివారించడం, అదుపు చేయడం సాధ్యం కావడం లేదు.

రూ.లక్షల్లో ఆస్తి నష్టం..

మండలంలోని ఖైరీ గ్రామంలో ఇటీవల భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ మీటర్‌లో జరిగిన షాట్ సర్క్యూట్‌తో ఆ గ్రామానికి చెందిన నాలుగు ఇళ్లు దగ్ధమయ్యాయి. ఇందులో మొహర్లే గిర్మాజికి చెందిన 30 క్వింటాళ్ల పత్తి, రూ.లక్ష, తులం బంగారం, మొహర్లే చంద్రయ్యకు చెందిన 20 క్వింటాళ్ల పత్తి, రూ.20 వేలు, తులం బంగారం, మొహర్లే సోమయ్య, కమలాబాయికి చెందిన ఇంటి సామగ్రి, ఇల్లు పూర్తిగా కాలిపోయాయి. ఆయా కుటుంబాలకు చెందిన ఇళ్లు అతి సమీపంలో ఉండడం.. ఒక ఇంట్లో గడ్డివాము ఉండడంతో క్షణాల్లో మంటలు వ్యాప్తి చెందాయి. కెరమెరిలో అగ్నిమాపక కేంద్రం ఉంటే పెద్దఎత్తున ఆస్తి నష్టం జరిగేది కాదని మండలవాసులు వాపోతున్నారు.

సర్వం కోల్పోయాం



విద్యుత్ షాట్ సర్క్యూట్ వల్ల సర్వం కోల్పోయాం. ఉదయం వరకు అన్ని సవ్యంగా ఉన్నా మధ్యాహ్నం ఒక్కసారిగా అంతా కాలి బూడిదైంది. 30 క్వింటాళ్ల పత్తి, తులం బంగారం మంటల్లో దగ్ధమైంది.

– మొహర్లే గిర్మాజి, ఖైరీ

తీవ్రంగా ఆస్తి నష్టం..



అగ్ని ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తి కోల్పోయాను. 20 క్వింటాళ్ల పత్తి, రూ. 1 లక్ష 20 వేల నగదు కాలి బూడిదైంది. ఇప్పటికీ కోలుకోలేక పోతున్నాం. ఫైరింజన్ త్వరగా వస్తే కొంతన్న ఆస్తి దక్కేది.

– మొహర్లే చంద్రయ్య, ఖైరీ

'ప్రజాపాలన' నిర్వహణకు చర్యలు

కెరమెరి: మండలంలో ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు కొనసాగే 'ప్రజాపాలన'ను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికలు ఖరారు చేశారు. ఈనెల 28న రాంగన్‌ఘాట్, కెస్లాగూడ, కెరమెరి, కఠారి, 29న గోయగాం, బోరిలాల్‌గూడ, అనార్‌పల్లి, ధనొరా, 30న మోడి, బాబేఝరి, జోడేఘాట్, ఝరి, జనవరి 2న ఆగర్‌వాడ, భోలాపటార్, అంతాపూర్, ఖైరీ, 3న సావర్‌ఖెడా, దేవాపూర్, కరంజివాడ, సుర్దాపూర్, 4న గోండ్‌గూడ, ఇందాపూర్, పార్డ, 5న పరంధోళి, కెలిబి, ముకదంగూడ, నిషాని, 6న తుమ్మగూడ, సాకడ, సాంగ్వి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రజాపాలన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 12 వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందులో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.


సాంగ్వి గ్రామపంచాయతీ కార్యాలయం

నేడు ప్రజాపాలనపై సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు 'ప్రజాపాలన' పై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మహా మండల పూజ


పడిపూజ నిర్వహిస్తున్న అర్చకులు

రెబ్బెన: మండల కేంద్రంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి అయ్యప్ప స్వామి మహా మండల పడి పూజా కార్యక్రమాన్ని అయ్యప్ప మాలధారణ స్వాములు కన్నుల పండువగా నిర్వహించారు. గురుస్వామి సూర్యభాస్కర శర్మ, అర్చకులు ముసునూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల నడుమ స్వామి వారి పద్దెనిమిది మెట్ల పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు మహాధర్నా

కౌటాల: ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పదవికి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక, బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బుధవారం మహాధర్నా నిర్వహించనున్నట్లు బీఎస్పీ మండల నాయకుడు శంకరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు నిర్వహించే మహాధర్నాకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. బీఎస్పీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

మొక్కులు తీర్చుకున్న బీజేపీ నాయకులు


మొక్కులు తీర్చుకుంటున్న నాయకులు

బెజ్జూర్: పాల్వాయి హరీశ్‌బాబు ఎమ్మెల్యేగా గెలవడంతో బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ యాదవ్, మాజీ ఎంపీపీ కొంద్ర మనోహర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం చింతలమానెపల్లి మండల శివపెల్లి శివాలయాన్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆదివాసీ మండల అధ్యక్షుడు మెస్రం రాజరాం, గిరిజన మోర్చ మండల అధ్యక్షుడు ఆత్రం రామయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణం.. పాట్లు..!

- అంతర్రాష్ట్ర రహదారిపైకి వస్తున్న చెట్ల కొమ్మలు
- తరుచూ ప్రమాదాలు జరుగుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు


రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు

సిర్పూర్(టి): మండలం మీదుగా మహారాష్ట్రకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపైకి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం మీదుగా వెళ్లే సిర్పూర్(టి) –మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో మండలంలోని నవేగాం, హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి గ్రామాల మధ్యలో ఉన్న రహదారికి ఇరువైపులా చెట్లు పెరిగి చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వస్తుండడంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. ఈ రహదారి గుండా మండలంలోని నవేగాం, హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి, సిర్పూర్(టి) గ్రామాల ప్రజలతో పాటు ప్రతీరోజు మహారాష్ట్రకు రాకపోకలు కొనసాగించే ప్రయాణికులు, వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కాగా వారు చెట్ల కొమ్మలతో ఇబ్బందులు పడుతుండడంతో పాటు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు.

ప్రమాదకర ప్రయాణాలు..

సిర్పూర్(టి) నుంచి అంతర్రాష్ట్ర రహదారి గుండా ప్రతిరోజు వాహనదారులు రాత్రి సమయాల్లో ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాల లైట్ల వెలుతురుకు ఇబ్బందులు పడి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో భారీ వాహనాల రాకపోకల సంఖ్య అధికంగా ఉండడం, మండలంలోని గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహనాల ద్వార ప్రయాణాలు సాగిస్తుండటంతో భారీ వాహనాలతో ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న చెట్లకు ఢీకొని రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగి ప్రమాదకరంగా మారినా సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండలవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అంతర్రాష్ట్ర రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



మండలంలోని హుడ్కిలి, జక్కాపూర్, నవేగాం గ్రామాల నుంచి సిర్పూర్(టి) మండల కేంద్రానికి రావడానికి ప్రతిరోజు ద్విచక్రవాహనాల ద్వార రాకపోకలు కొనసాగిస్తుంటాం. రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగి ప్రమాదకరంగా మారడంతో ఇబ్బంది పడుతున్నాం. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

– కిర్మరె శ్యాంరావు, సిర్పూర్ (టి)

అధికారులు స్పందించాలి..



మండల కేంద్రం మీదుగా మహారాష్ట్రకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపై రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏళ్లుగా రోడ్డుకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– శేఖర్, సిర్పూర్ (టి)

కమ్మేసిన మంచు!


యాపలగూడలో ఇళ్లపై కమ్ముకున్న పొగమంచు

కౌటాల: మండలంలో మంగళవారం ఉదయం విపరీతంగా మంచు కురిసింది. గత రెండు రోజులుగా మంచు తీవ్రతకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: ఆరోగ్యంపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. సీఎస్సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని బాల భారతి హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మికులకు నిర్వహించిన ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యులు పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబును ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు ఘనంగా సన్మానించారు. మంగళవారం పట్టణంలోని విద్యాధరి హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు పెద్దపల్లి కిషన్‌రావ్, సుదర్శన్ గౌడ్, దుర్గం గోపాల్, కుమ్మరి రాజన్న, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ చైర్మన్

ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం పట్టణంలోని సర్‌సిల్క్‌లో గల ఎమ్మెల్యే నివాసంలో డాక్టర్ అజర్ హుస్సేన్‌తో కలిసి ఎమ్మెల్యేకు పూలమొక్క అందజేసి అభినందించారు.

కనుల పండువగా అక్షింతల శోభాయాత్ర


దహెగాంలో అయోధ్య అక్షింతలతో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

రెబ్బెన: శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలానికి వచ్చిన శ్రీరామ అక్షింతల శోభాయాత్రను మంగళవారం మండల కేంద్రంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన శ్రీ రామ అక్షింతలను ఉత్సవ సమితి సభ్యులు నెత్తిన పెట్టుకొని డీజే చప్పుళ్లతో మండలంలోని దేవులగూడ నుంచి సీతారామాంజనేయ స్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అహల్యాదేవి, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు తిరుపతి, బాలక్రిష్ణ, చిరంజీవిగౌడ్, సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రకాశ్‌అగర్వాల్, రమేశ్, శ్రీధర్, దుర్గం భరద్వాజ్, కుందారపు శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.


రెబ్బెనలో శోభాయాత్ర నిర్వహిస్తున్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు

దహెగాం: శ్రీరాముని అయోధ్య నుంచి వచ్చిన పూజిత అక్షింతలతో మంగళవారం మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం నుంచి శివాలయం వరకు శోభాయాత్ర చేపట్టారు. ఆలయంలో వేద పండితుడు పరమేశ్వర్ అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై శ్రీరాం, జైశ్రీరాం నామ స్మరణతో మండలం మారుమోగింది. కార్యక్రమంలో మహిళలు, భక్తులు భారీగా పాల్గొన్నారు.

శ్రీరామ మందిర చిత్రపటం, ఆహ్వానపత్రం ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న భానుచందర్

కాగజ్‌నగర్‌టౌన్: శ్రీరామ మందిర చిత్రపటం, ఆహ్వాన పత్రాలను రాష్ట్రీయ స్వయం సేవక సంఘ విభాగ ప్రచారక్ భానుచందర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర అక్షింతల వితరణ కార్యక్రమంలో భాగంగా జనవరి 1 నుంచి 15 వరకు అయోధ్య నుంచి వచ్చిన అంక్షింతలు, భవ్య మందిరం ఫొటో, కరపత్రాలు ప్రతీ ఇంటికి వెళ్లాలనే సంకల్పంతో సమావేశాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. జనవరి 22న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ప్రతీ మందిరంలో భజన కార్యక్రమాలు చేపట్టాలని, అదేరోజు సాయంత్రం ప్రతీ కుటుంబం ఐదు దీపాలు వెలిగించాలని పిలుపునిచ్చారు.

కంటి శిబిరానికి స్పందన


కంటి శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

కౌటాల: మండల కేంద్రంలోని జాన్వీ విజన్ కేర్‌లో మంగళవారం లయన్స్ క్లబ్, కాగజ్‌నగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్స శిబిరానికి స్పందన లభించింది. శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత 11 ఏళ్ల నుంచి క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరాలు నిర్వహించి కంటి ఆపరేషన్‌లు చేస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. ప్రతీ మంగళవారం ఉచిత కంటి శిబిరం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు వానుపటేల్, నాయకులు మిథున్, భీమయ్య, నారాయణ సర్కార్, అశోక్, రమేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న సత్యనారాయణ శర్మ

ఆసిఫాబాద్‌అర్బన్: డీడీఎన్ పథకంలో అర్చకులుగా పని చేస్తున్న వారి సంక్షేమానికి అందరి సహకారంతో తన వంతు కృషి చేస్తానని డీడీఎన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణ శర్మ తెలిపారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని రామాలయంలో నిర్వహించిన డీడీఎన్ అర్చకుల ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్ శర్మ, కార్యదర్శి శ్రీనివాస్ శర్మలతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అర్చకులకు ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు అందేలా ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అర్చకులు క్రమం తప్పకుండా ఆలయాలకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి సంతోష్‌శర్మ, సభ్యులు తిరుపతిచారి, సూర్యనారాయణ, విజయ్‌కుమార్, ప్రశాంత్, అభయ్‌కుమార్ ఆచార్య, రఘురాం, గిరీష్, సుభాష్, మహేందర్, రవీందర్, రాంచందర్, అర్చకులు పాల్గొన్నారు.